క్లుప్తంగా

నేడు తెనాలిలో ఆరోగ్య బీమా ఉచిత రిజిస్ట్రేషన్లు



తెనాలిఅర్బన్: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య బీమాను నేడు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు సినీ దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. సుల్తానాబాద్‌లోని రతా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో అర్హులైన వారికి ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు చెప్పారు. రత్నా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అర్హులైన వారు ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన సెల్ ఫోన్‌ను తీసుకురావాలని సూచించారు. సమావేశంలో పెన్ని మినిస్ట్రీస్ డైరెక్టర్ దొన్నెపూడి ప్రదీప్, దాసరి శివన్నారాయణ పాల్గొన్నారు.

రేపు గాంధీ జయంతి వేడుకలు

కొల్లిపర: గాంధీ జయంత్రి పురస్కరించుకొని సోమవారం ఉదయం 10 గంటలకు కొల్లిపర గ్రామంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కొల్లిపర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అన్నవరపు రమేష్ తెలిపారు. శనివారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథులుగా ఎస్ఐ రవీంద్రారెడ్డి పాల్గొన్ని కల్యాణ మండపం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించటం జరుగుతుందన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిటౌన్: పట్టణ రైల్వేస్టేషన్ రోడ్డులోని కాకుమాను వెంకట సుబ్బయ్య ధర్మసత్రంలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. కాకుమాను సుబ్బయ్య వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని సత్రం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు కాకుమాను గిరిధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సత్రం కార్యనిర్వహణాధికారి ఎస్‌విఎస్ మల్లీశ్వరి, కన్నెగంటి గోపిచంద్, శ్రీనివాస్, కృష్ణ, లక్ష్మీ, పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు



తెనాలిఅర్బన్: జెఎంజె కళాశాలలో శనివారం అంతర్ కళాశాలల వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఏబీఆర్ గవర్నమెంట్ కాలేజ్ (రేపల్లె), లయోలా కాలేజ్ (విజయవాడ), ఏసీ కాలేజ్ (గుంటూరు), హిందూ కాలేజ్ (గుంటూరు), విద్యార్థినీలు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, అధ్యాపకులు డాక్టర్ బి.మేరికుమారి, డాక్టర్ నిర్మల జ్యోతి, డాక్టర్ పద్మాలత, డాక్టర్ జ్యోతి ఒలివ, డాక్టర్ ఎస్.సరళాదేవి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జగ్గడిగుంట పాలెం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: బీసీ సంక్షేమ సంఘం జగ్గడిగుంటపాలెం గ్రామ అధ్యక్షునిగా కొడాలి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా సత్యనారాయణ, కార్యదర్శిగా కఠారి వేణుగోపాలరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రగడి కోటయ్యనగర్‌లోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో శనివారం బీసీ సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. జాయింట్ సెక్రటరీగా ఎం.దుర్గాభవానీ, కఠారి శ్యామ్‌సన్, పి.శ్రీనివాసరావులు ఎన్నికైనట్లు చెప్పారు. వీరికి నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు నియామక పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములుకండి

జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలిఅర్బన్: జనసేన పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కోరారు. తెనాలిలోని ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ నేటి నుంచి కృష్ణా జిల్లాల్లో వారాహి యాత్ర జరగనున్నదని, దానిలో అందరూ పాల్గొనాలని కోరారు. వారాహి యాత్రకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఇవ్వడం సంతోషకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ విముక్తి కోసం టీడీపీ జనసేనలు కలిపిపోటీ చేస్తాయని చెప్పారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు హరిదాసు గౌరిశంకర్, జాకీర్ హుస్సేన్, లీలా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకే జగనన్న ఆరోగ్య సురక్ష

- ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆవిష్కారమే లక్ష్యం
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



పెదరావూరు వైద్యశిబిరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రాధాన్యతను వివరించారు. ఇంటింటికీ వైద్యసిబ్బంది వెళ్లి, తమ పరిధిలోని ప్రజలకు అవసరమైన పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను, దీర్ఘకాలిక వ్యాధులను నమోదు చేస్తున్నారని గుర్తుచేశారు. మొత్తం 1.09 లక్షల ఆవాసాల్లో నమోదు తర్వాత తర్వాత, జగనన్న సురక్ష వైద్యశిబిరాల్లో ఆయా ప్రజలను నిపుణులైన వైద్యులు తగిన చికిత్సలు అందిస్తారని తెలిపారు. అవసరమైన మందులను సైతం ఉచితంగా పంపిణీ చేస్తారని వివరించారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం గతంలో ఏ ముఖ్యమంత్రి ఇంతటి ఉదాత్తమైన కార్యక్రమాన్ని చేపట్టలేదని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. ఆసుపత్రులను ఆధునీకరిస్తూ, వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేస్తూ కూడా ప్రజల ఇంటిముంగిటకు నాణ్యమైన వైద్యసేవలను తీసుకెళ్లేందుకు జగనన్న సురక్షను ప్రవేశపెట్టారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన కార్యక్రమంతో నియోజకవర్గ ప్రజలకు సేవచేసుకునే భాగ్యం తనకు లభించిందని చెప్పారు. వివిధ దశల్లో మొత్తం 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. వీరితో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, మున్సిపల్ వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి మాట్లాడారు. మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో....

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ఇంటింటి సర్వే తెనాలిలో విస్తృతంగా జరుగుతోంది. శనివారం ఉదయం గంగానమ్మపేట, ముత్తంశెట్టిపాలెం, కొత్తపేట, చెంచుపేట, చినరావూరు పరిధిలోని ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి టెస్టులను చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. వచ్చే నెల ఐదోవ తేదీ నుంచి నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాలకు వారిని తీసుకువెళ్లి పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ బీబీజాన్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్ దాసరి రత్నకుమారి, సూపర్‌వైజర్ మల్లేశ్వరరావు, సచివాలయ ఏఎన్ఎంలు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



తెనాలిలో మహిళకు రక్త పరీక్ష చేస్తున్న సిబ్బంది

మూడు నుంచి కార్యక్రమ వివరాలు..



డాక్టర్ సుబ్బారావు

తెనాలిటౌన్: మండలంలోని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో ఈ నెల మూడోవ తేదీ నుంచి సచివాలయాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.వి సుబ్బారావు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వివరాలను ఆయన తెలియజేశారు. ఈ నెల మూడున కొవెవరం-2, ఐదున కొవెవరం-1, ఏడున కంచర్లపాలెం, 10న కొలకలూరు-1, 12న కొలకలూరు-3, 16న నందివెలుగు-1, 18న గుడివాడ, 20న నందివెలుగు-2 సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు వైద్యసేవలను ఉపయోగించుకోవాలని డాక్టర్‌సుబ్బారావు కోరారు. 3వ తేదీన కొవెవరంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతీలు పాల్గొంటారని చెప్పారు.

పెదరావూరులో వైద్యశిబిరానికి విశేష స్పందన

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా శనివారం రూరల్ మండలం పెదరావూరులో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామప్రజలు పెద్ద ఎత్తున శిబిరానికి తరలివచ్చారు. వారిని సంగం జాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యులు పరీక్షించి, అవసరమైన చికిత్స చేశారు. మందులను ఉచితంగా అందజేశారు. మధ్యాహ్నం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వైద్యశిబిరాన్ని సందర్శించారు. వైద్యసేవలను పరిశీలించారు. వైద్యులు, ప్రజలతో ముఖాముఖీ మాట్లాడారు. వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందికి ఇళ్లకు వెళ్లి, ప్రజల ఆరోగ్య సమస్యలను నమోదుచేసుకోగా, వారందరికీ వైద్యచికిత్సలు, సలహాల కోసం ఈ శిబిరాన్ని నిర్వహించారు.

వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు

తెనాలిఅర్బన్: ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజులు చెల్లించాలని కొందరూ ఫేక్ ఫోన్ కాల్ చేసి ఆన్‌లైన్‌లో వాటి ఫీజు చెల్లించాలని ఒత్తిడి తేస్తూ తమ దృష్టికి తెచ్చిందని, అలాంటి వాటి పట్ల వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఫేక్ ఫోన్ కాల్స్ ఎక్కువగా వస్తున్నట్లు తెలిసిందన్నారు. వ్యాపారులు ఎవరు మోసపోకుండా ఆన్‌లైన్‌లో అలాంటివి చెల్లించవద్దని సూచించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ రావాన్ని చెప్పారు. వ్యాపారులు తమ లైసెన్స్ ఫీజులను మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్‌లో చెల్లించి రశీదు పొందాలని సూచించారు. అలాగే యూజర్ చార్జీలను కూడా వార్డు సెక్రటరీలకు, సచివాలయాల్లో మాత్రమే చెల్లించి రశీదు పొందాలని చెప్పారు. వ్యాపారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

నేటి నుంచి స్వచ్ఛ భారత్ దివాస్ కార్యక్రమం

స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆది, సోమవారాల్లో స్వచ్ఛ భారత్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ క్లినింగ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బహుమతుల ప్రధానోత్సవం జరుగుతుందన్నారు. సిబ్బంది ఎవరికి సెలవులు ఇవ్వడం జరగదని, అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

కోర్టులో స్వచ్ఛత కార్యక్రమం



తెనాలిఅర్బన్: కేంద్రప్రభుత్వం, సుప్రీం కోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టు వారి ఆదేశాల మేరకు 11వ అదనపు జిల్లా జడ్జి జి.మాలతీ ఆధ్వర్యంలో తెనాలి కోర్టు ప్రాంగణంలో శనివారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. కోర్టు ఆవరణను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాలరావు, కార్యదర్శి హరిదాస్ గౌరీశంకర్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ఏజీపీ మాణిక్యరావు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మల్లిఖార్జున రెడ్డి, పలువురు న్యాయవాదులు, కోర్టు గుమస్తాలు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

తెనాలిరూరల్: మోపెడ్ అపహరణకు గురవడంపై కేసు నమోదైంది. పట్టణ ముత్తెంశెట్టిపాలెంలోని బాబా టవర్స్ సమీపంలో రోడ్డుపై నిలిపి ఉంచిన మోపెడ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. వాహన యజమాని పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం రాత్రి తెలిపారు.

వివాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు

తెనాలి రూరల్: వివాదాలు, ఘర్షణల్లో ప్రమేయం ఉందని తెలిస్తే రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు హెచ్చరించారు.. తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఆదేశించారు. రౌడీషీటర్లకు వివాదాలు ఘర్షణల్లో ప్రమేయం ఉన్నట్టు తెలిస్తే బహిష్కరణ విధిస్తామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగిన వారిపై షీట్ ఎత్తివేసే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అనారోగ్యంతో బిహార్ కూలీ మృతి

తెనాలిరూరల్: అనారోగ్యంతో బిహార్‌కు చెందిన కూలీ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నా యి. బిహార్‌కు చెందిన కూలీల బృందం 10 రోజుల కిందట తెనాలి వచ్చింది. మండలంలోని నేలపాడు పెదరావూరు ప్రాంతాల్లో పనులకు వెళుతున్నారు. ఈ బృందంలోని సభ్యుడు చున్‌చున్ కుమార్ (27) మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురై తెనాలి జిల్లా వైద్యశాలలో వైద్యం పొందుతున్నాడు. శుక్రవారరాత్రి వైద్యశాలలో అడ్మిట్ అయిన అతను శనివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు రాత్రికి తెలిపారు.

పురపాలక సమావేశం ప్రశాంతం



ప్రసంగిస్తున్న చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రామయ్య

- అజెండాలోని అన్ని అంశాలు ఆమోదం
- టీడీపీ కౌన్సిలర్లు నిరసన

తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. దీనిని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం నిర్వహించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరశిస్తూ టీడీపీ కౌన్సిలర్‌లు ప్లకార్డులు, మూతికి నల్లరిబ్బన్‌లు కట్టుకుని సమావేశానికి హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే కౌన్సిల్‌కు సంబంధంలేని, రాజకీయ పార్టీలకు సంబంధించిన నిరసనలు ఇక్కడ చేయటం మంచి పద్ధతి కాదని ప్లకార్డులు బయట ఉంచాలని చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ సూచించారు. దానికి టీడీపీ కౌన్సిలర్‌లు అంగీకరించకుండా వాటిని ప్రదర్శిస్తు వచ్చారు. చైర్‌పర్సన్ ఎంత చెప్పినా వారు వినకపోవటంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రమేష్ లేచి కౌన్సిల్‌లో ఇలా ప్రవర్తించటం మంచి పద్ధతి కాదని సూచించారు. చైర్‌పర్సన్ సూచనలు పాటించాలని కోరారు. అప్పటికీ వినకపోవటంతో టీడీపీ కౌన్సిలర్‌లపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రతిపాదించారు. ఎంతసేపటికీ టీడీపీ కౌన్సిలర్‌లు వినకపోవటంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మొఘల్ అహ్మద్ బేగ్ లేచి అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నామని తెలిపారు. దీనికి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు అంగీకారం తెలపటంతో అజెండాలోని అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జశ్వంతరావు, ఎంఈ నాగమల్లేశ్వరరావు, పలువురు కౌన్సిలర్‌లు, కో అప్షన్ సభ్యులు, వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యలోనూ మెలకువలు నేర్చుకోవాలి



మాట్లాడుతున్న తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అనిల్‌కుమార్

తెనాలిటౌన్: దాతల సహకారంతో పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందిస్తున్నామని కొలకలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం చైతన్య శారద ట్రస్ట్, కంటినెంటల్ కాఫీ లిమిటెడ్ దుగ్గిరాల వారి సహకారంతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. నాలుగేళ్ళ క్రితం పాఠశాలలో పూర్వ విద్యార్థులు కంప్యూటర్లు బహుకరించారని, ఆ కంప్యూటర్ల ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ విద్యలో శిక్షణ ఇస్తున్నామని హెచ్‌ఎం తెలిపారు. సీసీఎల్ వారి సహకారంతో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు ఒక టీచర్‌ను నియమించినట్లు చెప్పారు. ఆ ఉపాధ్యాయనీ పనితీరు, విద్యార్థులు కంప్యూటర్‌లో నేర్చుకున్న విషయాలను పరిశీలించేందుకు శనివారం పాఠశాలకు వచ్చారు. విద్యార్థుల పనితీని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలకు ఐదు కంప్యూటర్లు ఇస్తామని సీసీఎల్ డైరెక్టర్ విపిన్‌౩. సింగల్ హామీ ఇచ్చారు. విద్యార్థులు కంప్యూటర్ విద్యలో మంచి నైపుణ్యాలు ప్రదర్శించి మెళుకువలు నేర్చుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో కంప్యూటర్ విద్యను అందిస్తున్న ఉపాధ్యాయని ఉండవల్లి స్వప్నను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో వై.పల్లవి, సీసీఎల్ కో-ఆర్డినేటర్ జి.నాగరాజు, చైతన్య సారధి ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వంటపాత్రల పంపిణీ

తెనాలిఅర్బన్: రెడ్ క్రాస్ సొసైటీ తెనాలి శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఒక కుటుంబానికి స్టీల్ సామాను, దుస్తులను పంపిణీ చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా 12వ వార్డులో నివశించే ఇందిర ఇల్లు ఇటీవల కాలిపోయిన విషయం తెలిసిందే. మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, కౌన్సిలర్‌లు కొర్రా యశోదా, కుర్రా సుజాత, రెడ్ క్రాస్ కార్యదర్శి ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ మూర్తి పాల్గొన్నారు.

3న పాలిటెక్నిక్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2023 కన్వీనర్ మార్గదర్శకాల ప్రకారం డిప్లొమాలో సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాల్లో నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 83329 11155, 93907 87574 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ ధర్నా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు మాట్లాడుతూ ప్రభుత్వం బలవంతంగా తీసుకువచ్చిన జీపీఎస్‌ను అంగీకరించే ప్రసక్తి లేదని తెలిపారు. జీపీఎస్ ప్రతిపాదనతో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యమం దారిమళ్లి, ఆర్థిక పరమైన అంశాలు వెనక్కు వెళ్లాయని ఆరోపించారు. 11వ పీఆర్సీ, పీఎఫ్, డీఏ బకాయిలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో కె. చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. ఖాలీద్, నాయకులు పాల్గొన్నారు

పరిసరాల శుభ్రత తోనే స్వచ్ఛత

పొన్నూరు: ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ ఆదేశాల మేరకు పొన్నూ రు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించారు. కోర్టు ఆవరణను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. సత్యకుమారి, సిబ్బంది శుభ్రం చేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రేపు గురుపీఠ పురస్కారాల ప్రదానం

తెనాలి హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయానికి దశాబ్దాల చరిత్ర



హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయం

తెనాలి: స్థానిక హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయంలో గాంధీ జయంతి రోజున గాంధీజయంతి, గురుపీఠ పురస్కారాల ప్రదానం జరగనుంది. ఉదయం 10 గంటలకు ప్రేమీమండలిలో డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన ఏర్పాటయే ప్రత్యేక సభలో హిందీప్రచారంలో విశేష కృషిచేసిన విశాఖ పట్టణంలోని సెయింట్ జోసఫ్ మహిళా కాలేజీ హిందీ విభాగ అధ్యక్షులు ఆచార్య పిశిపాటి కామేశ్వరి, గుంటూరు కేంద్రీయ విద్యాలయం విశ్రాంత హిందీ అధ్యాపకుడు సుగ్గుల గిరిధరరావుకు గురుపీఠ పురస్కారాలను బహూకరిస్తారు.

రాష్ట్రంలో వందేళ్లకు పైగా జరుగుతున్న జాతీయ భాష హిందీ ప్రచారోద్యమంలో హిందీ ప్రేమీమండలికి ఎనిమిదిన్నర దశాబ్దాల చరిత్ర ఉంది. స్వాతంత్ర్య ఉద్యమంలో హిందీ ప్రచారానికి అంకురార్పణ జరిగిది. 1919లో మంచిలీపట్నంలోని ఆంధ్ర జాతీ య కళాశాల, తెనాలిలోని తిలక్ జాతీయ విద్యాల యం హిందీ ప్రచారాన్ని ఉద్యమంగా ఆరంభించారు. దీని విశిష్టతను తెలుసుకున్న గాంధీజీ 1929 ఏప్రిల్ 19న ఈ విద్యాలయాన్ని సందర్శించారు. ప్రత్యేకంగా తెప్పించిన రంగూన్ టేకు స్తంభంపై జాతీయ జెండాను ఎగురవేశారు.1930లో ఉప్పు సత్యాగ్రహులకు ఈ విద్యాసంస్థ క్యాంపుగా ఉపకరించింది. తర్వాత ఏర్పడిన అవాంతరాలతో విద్యాలయం మూతపడింది.

గాంధీ నిర్మాణ కార్యక్రమంలోని జాతీయ భాషా ప్రచారం నిమిత్తం హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయాన్ని అదే ప్రదేశంలో 1938లో స్థాపించారు. ఇందుకు చిట్టూరి లక్ష్మీనారాయణ శర్మ కృషిచేయగా, మద్ది వెంకటరంగయ్య, మల్లాది దేవేంద్రుడు, ఇటికాల సూర్యనారాయణ సహకరించారు. గాంధీజీ వచ్చి సందేశమిచ్చిన ప్రదేశాన్ని గాంధీ శిబిరంగా ప్రత్యేకంగా ఉంచారు. అప్పట్నుంచి ప్రారంభిక నుంచి స్నాతకోత్తర పరీక్షల వరకు విద్యాబోధన చేశారు. 1.50 లక్షలకు పైగా విద్యార్థులు శిక్షణ పొందారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ, మద్రాస్ సహకారంతో 1954లో హిందీ ప్రచారక్ ప్రశిక్షణ మహావిద్యాలయం స్థాపించారు. అయిదు వేల మంది ప్రశిక్షణార్థులు ఉత్తీర్ణులై ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా హిందీ బోధనలో ఉన్నారు. ఇప్పటికీ ప్రాథమిక నుంచి విశారద, ఉత్తరార్ధ వరకు బోధిస్తున్నారు హిందీ బోధనతోనే సరిపెట్టుకోకుండా హిందీ ప్రచార సాఫల్యానికి బహుముఖమైన కార్యక్రమాలను ప్రేమీమండలి నిర్వహించింది. వేసవి తరగతులు, రాత్రి పాఠశాలలు, మహిళలకు హిందీ, ఎంబ్రాయిడరీ తరగతులు, హిందీ విజయపత్ర వితరణ ఉత్సవాలు, హిందీ నాటక ప్రదర్శనలు, హిందీ మహాసభలు నిర్వహించారు. ఇక్కడ నాలుగు వేల పుస్తకాలతో గ్రంథాలయం ఉంది.

సంస్థ ప్రగతికి కులపతి దంపతులు బోయపాటి నాగేశ్వరరావు, సుభద్రాదేవి విశేషంగా కృషిచేశారు. బోయపాటి సాహిత్యాలంకార పట్టభద్రుడు కాగా, సుభ ద్రాదేవి వార్ధా ఆశ్రమంలో శిక్షణ పొందిన వినీతా పట్టభద్రురాలు. ఆరు దశాబ్దాలకు పైగా వీరు హిందీ భాషా వ్యాప్తికి సేవలందించారు. ప్రేమీమండలి కార్యదర్శి/ ప్రిన్సిపాల్‌గా చేసిన బోయపాటి నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారసభ అధ్యక్షుడిగా, కేంద్రీయ హిందీ సంస్థాన్, ఆగ్రా విద్యాపరిషత్ సభ్యుడిగానూ చేశారు. హిందీ ప్రచారసభ వెలువరించే పూర్ణకుంభ, స్రవంతి పత్రికలకు సంపాదకుడిగానూ చేశారు. వీరి కృషికి భారత ప్రభుత్వం 'గంగా శరణ్ సింహ్' అవార్డును నాటి రాష్ట్రపతిచే అందజేసింది.

పూరిపాకల్లో మొదలైన ప్రేమీమండలికి 1967లో అప్పటి ఆర్డీవో రామకృష్ణ పరమహంస, ప్రజల సహకారంతో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించి ఇచ్చారు. కన్నెగంటి వెంకట్రామయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మహిళా వసతి గృహాన్ని నిర్మించారు. వజ్రోత్సవాల సందర్భంగా హిందీ ప్రచారకులకు శిక్షణకని మూడంతస్తుల గాంధీ శిబిర భవనంను వజ్రోత్సవాల్లో ప్రారంభించారు. 1969లో సంస్థ రజతోత్సవాలు, 1990లో స్వర్ణోత్సవం, 1994లో హిందీ ప్రచారసభ అమృతోత్సవాలను, తర్వాత వజ్రోత్సవాలను నిర్వహించారు. 1992 నుంచి సంస్థ అధ్యక్షుడిగా డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి కొనసాగుతున్నారు. బోయపాటి కుటుంబ సభ్యులు కమిటీలో ఉన్నారు. హిందీ భాషలో విశేషంగా కృషిచేస్తున్న ఇద్దరు ప్రముఖులకు ఏటా గాంధీ జయంతిరోజున గురుపీఠ పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు.



నాగేశ్వరరావు-సుభద్రాదేవి దంపతులు (ఫైల్)



తొలినాళ్లలో చాపలపై తరగతులు (ఫైల్)